



అమరావతి అశేష జనవాహిని మధ్య స్వామి వార్ల రథోత్సవం

ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

కన్నుల పండువగా కల్యాణోత్సవం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి అమరేశ్వరుని లింగోద్భవ అభిషేకాల అనంతరం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణోత్సవం జరిగింది. ఆలయంలోని స్వామి కల్యాణ మండపంలో కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్ దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించగా ఆలయ ప్రధానాచార్యులు, వేదపండితులు, అర్చకులు కల్యాణాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు జాగారం చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామివార్ల తలంబ్రాలను, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం గురువారం ఉదయం నూతన దంపతులైన ఉత్సవమూర్తులు హంస, నంది, మిద్దె రథంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. దారిపొడవున భక్తులు స్వామి వార్లకు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కీలుగుర్రంపై గ్రామోత్సవంలో విహరించారు.

కమనీయం రథోత్సవం

- భక్తిశ్రద్ధల మధ్య అమరేశ్వరుని రథోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన అమరావతి వీధులు
- జాగారం చేసి కల్యాణాన్ని తిలకించిన భక్తులు
- హంస, నంది, మిద్దె రథంపై కల్యాణమూర్తుల గ్రామోత్సవం



రథోత్సవం ముందు వివిధ వేషధారణలో కళాకారులు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జై.. సాంబశివ. శంభో.. శంకర.. శివశంకర.. నామస్మరణలతో అమరావతి వీధులు మారుమోగాయి. భక్తుల జయజయధ్వానాలు.. మంగళవాయిద్యాలు.. డ్రోన్లతో ఆకాశం నుంచి పూల వర్షం కురుస్తుండగా.. వేదమంత్రోశ్చరణల మధ్య గురువారం సాయంత్రం అమరేశ్వరుని రథోత్సవం అమరావతి పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరావతిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తుల సమక్షంలో బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం గురువారం సాయంత్రం దేవతామూర్తుల రథోత్సవం భక్తుల శివనామ స్మరణలతో అంబరాన్ని తాకింది. ముందుగా స్వామివార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రథశాలకు తీసువచ్చి పూలతో అలంకరించిన రథంపై ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, హరిబాబు, ఈవో సునీల్‌కుమార్ టెంకాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమరావతి పురవీధులు కిటకిటలాడాయి. డీఎస్పీలు హనుమంతరావు, వెంకటరమణల పర్యవేక్షణలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాలుగు డ్రోన్ కెమేరాలతో రథోత్సవాన్ని పోలీసులు పర్యవేక్షించారు. కళాకారుల ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు భక్తులను అలరించాయి.

కన్నుల పండువగా లింగోద్భవ అభిషేకాలు



6

కమనీయం.. మల్లేశ్వరుడి కల్యాణం



6



ఉన్నతంగా ఎదగడమే అసలైన విజయం
ఒలింపిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రెసిడెంట్ పీటీ ఉష



తెనాలిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి మనోహర్



దుగ్గిరాలలో ఏఈఆర్ఓ సునీతతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్



ఓటు వేసిన కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరులో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, లక్ష్మణరావు

పట్టభద్రులు.. ఓటెత్తారు

- 69.57 శాతం పోలింగ్ నమోదు
- గతంలో కంటే 10 శాతంపైగా పెరుగుదల
- తమకే అనుకూలమంటున్న కూటమి నేతలు
- అవన్నీ రిగ్గింగ్ చేసినవేనని పీడీఎఫ్ వర్గాల ఆరోపణ

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులైన దివ్యాంగులు.. గర్భిణులు.. ఉద్యోగులు.. మహిళలు.. ఓటు వేసేందుకు పోటెత్తారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం వెల్లివెరిసింది. స్వల్ప తోపులాటలు మినహా ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. విద్యావంతులు అధిక సంఖ్యలో ఉండే గుంటూరు, విజయవాడ లాంటి నగరాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. గంట గంటకు పోలింగ్ పెరుగుతూ వచ్చింది. ఉదయం 10 గంటలకు 11.08 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 29.97 శాతం, 2 గంటలకు 49.06 శాతం, సాయంత్రం 4 గంటలకు 65.58, సమయం ముగిసినప్పటికీ అప్పటికే క్యూలో ఉన్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సరికి 69.57 శాతానికి చేరుకున్నది. గురువారం ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని ఎన్నికల సంఘం ప్రకటించడం, ప్రైవేటు కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు ఓటు వేసి ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశాలు జారీ.. విద్యా సంస్థలకు సెలవు తదితరాలతో ఓటు వేసేందుకు పట్టభద్రులు పోలింగ్ బూత్‌లకు బారులు తీరారు. ఉదయం 7.30 గంటలకే బూత్‌ల వద్దకు చేరుకుని క్యూలో నిలుచుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. దివ్యాంగులైన పట్టభద్రులు వయస్సుతో సంబంధం లేకుండా పోలింగ్ బూత్‌లకు రావడం విశేషం. మరోవైపు గర్భిణులు, బాలింతలు కూడా వచ్చి ఓటు వేశారు. ఈ కారణంగానే గతంలో కంటే దాదాపుగా 10 శాతం పైగా పోలింగ్ పెరిగింది. 2019లో ఎన్నికలు జరిగినప్పుడు 59.39 శాతం పోలింగ్ నమోదైంది. ఈ దఫా 69.57 శాతానికి పెరిగింది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా దాదాపుగా 77.33 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటలు మందకొడిగా సాగిన ఓటింగ్ ఆ తర్వాత ఊపందుకుంది. మధ్యాహ్ననికి ఓటర్లు పోలింగ్ స్టేషన్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 4 గంటలకు గడువు ముగిసే సమయానికి కూడా ఓటర్లు క్యూల్లో ఉండడం గమనార్హం. ఆరు జిల్లాల పరిధిలో 483 పోలింగ్ బూత్‌లలో 2,41,502 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దాదాపు లక్షా 5 వేల 634 మంది పోలింగ్ బూత్ ముఖమే చూడలేదు. గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి పోలింగ్ ప్రక్రియను అధికారులతో కలిసి రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ప్రత్యేకంగా పరిశీలించారు.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం ఇలా...

జిల్లా పేరు	ఓటర్లు	ఓటేసిన వారు	శాతం
ఏలూరు	16099	11801	73.30
కృష్ణా	63114	44125	69.91
ఎన్‌టీఆర్	78063	51279	65.59
గుంటూరు	108109	71836	66.45
బాపట్ల	24493	18198	74.30
పల్నాడు	57238	44263	77.33
మొత్తం	347116	241502	69.57

- మొత్తం ఓటర్లు 3,47,116 మంది కాగా 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లున్నారు. వీరిలో పురుషులు 1,48,506 మంది, మహిళలు 92,994, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఓటుహక్కు కలిగిన పురుషుల్లో 71.93 శాతం, మహిళల్లో 66.13 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, సిట్టింగ్ ఎమ్మెల్సీ, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ తదితరులు గుంటూరులో ఓటుహక్కు వినియోగించుకున్నారు. కలెక్టర్ నాగలక్ష్మి గుంటూరులోని స్టాల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు.
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెనాలిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. గుంటూరులోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మద్దతు దారులు ఓటరు స్లిప్పులపై లక్ష్మణరావు ఫొటో ముద్రించి పంపిణీ చేస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులు అందినట్లు ఆర్‌వో నాగలక్ష్మి తెలిపారు. తూర్పులోని చలమయ్య కళాశాల వద్ద పీడీఎఫ్ ఏజెంట్, టీడీపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది.
- గుంటూరు జిల్లా పరిధిలోని మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. బందోబస్తుకు హాజరైన పోలీసులకు పలు సూచనలు చేశారు.



గుంటూరు పాలిటెక్నిక్ కాలేజీలోని 226 పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ప్రజలు

స్ట్రాంగ్‌రూంకు తరలిన బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో సిబ్బంది బ్యాలెట్ బాక్సులకు ఏజంట్ల సమక్షంలో సీళ్లు వేశారు. అనంతరం వాటిని తీసుకుని రూట్‌ల వారీగా తమకు కేటాయించిన వాహనాల్లో ఏసీ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు తరలివచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్లలో స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారంలు, పీవో డైరీ వంటివి క్షుణ్ణంగా పరిశీలించి బ్యాలెట్ బాక్సులను స్వీకరించి స్ట్రాంగ్‌రూంకు తరలించారు. పల్నాడు, బాపట్ల, ఎన్‌టీఆర్, ఏలూరు, కృష్ణ జిల్లాల్లో స్థానికంగానే తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా జిల్లాల బ్యాలెట్ బాక్సులను అక్కడ స్వీకరించి వాటన్నింటిని కలిపి గుంటూరు ఏసీ కళాశాలకు తరలించడం ప్రారంభించారు. అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులు వచ్చిన తర్వాత ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు స్ట్రాంగ్ రూంలకు చేర్చి సీలు వేస్తామని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు.

గెలుపుపై ధీమా..

పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం అటు రాజకీయ, ఇటు అధికారవర్గాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. పోలింగ్ శాతం గతంలో ఎన్నడూ లేని విధంగా పెరగడంతో ఎన్‌డీఏ కూటమి నేతలు తమకే అనుకూలమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా ఓటింగ్ తమకు అనుకూలంగా జరిగిందని, ఖచ్చితంగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు తథ్యంగా ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. తాము పక్కా ప్రణాళికతో పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యేందుకు శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించి దరఖాస్తులు చేయించామని దీంతో ఓటర్ల సంఖ్య పెరిగిందని ఆలపాటి వర్గీయులు చెప్తున్నారు. తమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలన్న ఆకాంక్ష పట్టభద్రుల్లో కనిపించిందంటున్నారు. పెరిగిన పోలింగ్ శాతం ఖచ్చితంగా తమ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే విజేతగా నిలబెడుతుందని చెబుతున్నారు. కాగా ఓటింగ్ శాతం గత మూడు పర్యాయాలు చూసుకుంటే 60 శాతం లోపే ఉండేదని, ఇప్పుడు అదనంగా 10 శాతం పైగా పెరగడానికి కారణం దొంగ ఓట్లు, రిగ్గింగ్, ఏజంట్లను పోలింగ్ బూత్‌ల నుంచి తరిమేయడమేనని పీడీఎఫ్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లాలో తమ ఏజంట్లను బూత్‌లలోకి రానీయకుండా ఓట్లు వేసుకున్నారని ఆరోపిస్తున్నారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 81 కేంద్రాలు.. 71,328 మంది విద్యార్థులు
- కార్యాలయంలో 0863-2228528 హెల్ప్‌లైన్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శనివారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. 20వ తేదీ వరకు జరిగే పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. ఈ పరీక్షలకు సంబంధించి విద్యార్థులను కేంద్రాల్లోకి 8.30 కల్లా అనుమతిస్తారు. 9 గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుతించమని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జుబేర్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమసంవత్సరం పరీక్షలకు 34,273 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 34,973 మంది, ప్రథమ సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల పరీక్షలకు 1215 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 867 మంది చొప్పున మొత్తం 71,328 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం 81 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమేరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల కోసం 16 స్టోరేజ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల పర్యవేక్షణకు 83 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించింది. ఫీజు కట్టిన ప్రతి విద్యార్థి హాజరుతో సంబంధం లేకుండా పరీక్ష రాసేలా అవకాశం కల్పించినట్లు జుబేర్ తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం హాల్‌టిక్కెట్లు వాట్సాప్ వెబ్(95523 00009) నుంచి డౌన్‌లోడు చేసుకుని ప్రిన్సిపల్ సంతకం లేకున్నా సరే నేరుగా పరీక్షకు హాజరుకావచ్చని తెలిపారు.



పరీక్షలకు హాజరైన విద్యార్థులు (పాత చిత్రం)

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కాపీ యింగ్‌కు అవకాశం లేకుండా 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఉంటాయన్నారు. పరీక్షల పై సందేహాలు, ఫిర్యాదుల చేసేందుకు ఇంటర్ బోర్డు కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రం(0863- 2228528) ఏర్పాటు చేశారు.

ప్రభలోత్సవం

- అంగరంగ వైభవంగా కోటయ్య తిరునాళ్ల
- విజయవంతంగా ముగిసిన త్రికోటేశ్వరుని ఉత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట) ఫిబ్రవరి 27: కోటయ్య క్షేత్రం ప్రభలతో కనువిందు చేసింది. కోటప్పకొండపై కోటయ్య తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నేత్రపర్వంగా సాగాయి. రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులతో ప్రభలు కనువిందు చేశాయి. అర్ధరాత్రి జాగరణకు తరలివచ్చిన కోటయ్య భక్తులు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి తరించారు. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి త్రికోటేశ్వరుని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



తిరునాళ్లలో కాంతులీనుతున్న ప్రభలు

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా ముగిశాయి. బుధవారం సాయంత్రం నుంచి భక్తులు పోటెత్తడంతో త్రికూటాద్రి కిటకిటలాడింది. తిరునాళ్లలో 20 భారీ విద్యుత్ ప్రభలు భక్తులకు కనువిందు చేశాయి. ప్రభలపై నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొండకు తరలివచ్చాయి. కోటయ్యస్వామి ఆశీస్సులతో తిరునాళ్ల ఉత్సవం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. నాదెండ్ల మండలం అప్పాపురం,అవిశాయపాలెం, చిలకలూరిపేట మండలం పురుషోత్తంపట్నం, కావూరు, కోమటినేనివారిపాలెం, కమ్మవారిపాలెం, యడవల్లి, మద్దిరాల, గోవిందాపురం, బొప్పూడి, నరసరావు పేట మండలం కాకాని, ఉప్పలపాడు, చింతలపాలెం, గురవాయ పాలెం గ్రామాల నుంచి తరలివచ్చిన భారీ విద్యుత్ ప్రభలు కొండ వద్ద కొలువు దీరాయి.


త్రికోటేశ్వర స్వామికి క్షీరాభిషేకం


పెరుగుతో..


నెయ్యితో..


ఫలాలతో..


ఎండు ఫలాలతో..


కుంకుమతో..


విభూదితో..


గంధంతో..


విశేష అలంకారంలో త్రికోటేశ్వరుడు

కనులపండువగా లింగోద్భవ అభిషేకాలు

కోటప్పకొండ (నరసరావుపేట) ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు కనులపండువగా, అత్యంత వైభవంగా జరిగాయి. పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, ఎండు ఫలాలు, విభూది, తేనె, పండ్ల రసాలు వివిధ ద్రవ్యాలతో స్వామికి లింగోద్భవ అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అభిషేకాల అనం తరం ప్రభుత్వం తరుపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమర్పించిన పట్టువస్త్రాలను స్వామికి అలంకరించారు. ఆలయ ట్రస్టీ మల్రాజు రామకృష్ణ కొండలరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. మల్లేశ్వరుని కల్యాణం

పెదకాకాని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కల్యాణం.. కమనీయం... శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. మహాశివరాత్రి పర్వదినమున స్వామి ఏకాథ ద్రవ్యములతో లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. లింగోద్భవ అభిషేకం, గ్రామోత్సవ సేవలో శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గజవాహనంపై గ్రామోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎదుర్కోలోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి కల్యాణం ప్రత్యేక వేదికపై అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ప్రముఖ కల్యాణ వ్యాఖ్యాత పుల్లాభట్ల వెంకటేశ్వర్లు కల్యాణ వ్యాఖానం చేశారు. భక్తులకు స్వామి వారి కల్యాణ అక్షింతలు, లడ్డూ ప్రసాదంను పంపిణీ చేసినట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.


శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు

దివ్య రథోత్సవం

పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. నంది వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల ఆదాయం రూ.1.77 కోట్లు

కోటప్పకొండ (నరసరావుపేట), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు దేవస్థానానికి రూ. 1,77,68,918 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు గురువారం తెలిపారు. గత ఏడాది కంటే రూ.14.19 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. గతేడాది రూ.1,63,48,227 ఆదాయం వచ్చింది. దర్శనం, అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.65,01,070, హుండీల ద్వారా రూ. 73,47,918, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.38.16 లక్షలు లభించిందని ఈవో వివరించారు. ఉత్సవ అధికారి చంద్రకుమార్, ఈవో డి.చంద్రశేఖరరావు, దేవదాయ శాఖ అధికారులు శ్రీధర్‌రెడ్డి, టి.సుధాకరరెడ్డి పర్యవేక్షణలో హుండీ ఆదాయ లెక్కింపు జరిగింది.

కంపచెట్లలో శిశువు

● గుంటూరుకు తరలిస్తుండగా 108లో మృతి


కంపచెట్లల్లో పడి ఉన్న పసికందు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రక్తం మరకలు ఆరకముందే ఓ పసికందును కంపచెట్లలో పడేసిన సంఘటన మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని ఇటుకల బట్టీల వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామ సమీపంలోని ఇటుకల బట్టీల వద్ద కంపచెట్లలో ఒళ్లంతా రక్తపు మరకలు, తొలగించని బొడ్డుతో శిశువు ఏడుస్తూ ఉండటంతో, కేకలు విన్న ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునే వ్యక్తి స్థానికులకు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది సాయంతో ఆ పసికందును వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. 108 డ్రైవర్ సాంబశివరావు శిశువు పరిస్థితి గమనించి బొల్లాపల్లిలో నివాసం ఉంటున్న ఆయన సతీమణి సరళి సహాయంతో బాలుడి ఒంటిపై ఉన్న రక్తపు మరకలు తుడిసి పలు సేవలు అందించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేష్ ప్రైవేటు వైద్యశాలలోని శిశువుని పరిశీలించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలతకు పసికందును అప్పగించారు. ఆమె ప్రైవేటు వైద్యశాల నుంచి గవర్నమెంట్ వైద్యశాలకు శిశువుని తరలించి వైద్యసేవలు అందించారు. వైద్యపరీక్షల అనంతరం ప్రభుత్వ వైద్యాధికారి బాలునాయక్ సూచనల మేరకు 108 వాహనంలో గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో శిశువు మృతి చెందాడు. బాలుడిని కని కంపచెట్లలో పడేసిన కసాయి తల్లి వివరాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఆర్‌వో


ఏసీ కళాశాలలో స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్సులను చేరుస్తున్న ప్రక్రియని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ సరళిని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఏఆర్‌వో ఎన్‌షేక్ ఖాజావలి నిరంతరం పర్యవేక్షించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలోనే ఉండి పోలింగ్ సరళిని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను వీక్షిస్తూ పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకొన్నారు. ప్రతి జిల్లాకు ఒక అధికారిని కేటాయించి ఆయా జిల్లాల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొంటూ పోలింగ్ శాతం వివరాలను తెప్పించుకొని ఎన్నికల సంఘానికి నివేదించారు. సాయంత్రం 4 గంటలకు చాలావరకు పోలింగ్ కేంద్రాలు ఖాళీ అయిపోయాయని, కొన్ని చోట్ల మాత్రం క్యూలైన్లలో ఓటర్లు ఉండటంతో వారికి స్లిప్పులు ఇచ్చి ఓటు వేయడానికి అనుమతి ఇచ్చినట్లు ఆర్‌వో నాగలక్ష్మి తెలిపారు. గతంలో కంటే పోలింగ్ శాతం గణనీయంగా పెరగడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తాము నిర్వహించిన స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చామన్నారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లకు వాహనాల్లో తరలిస్తున్నారని, నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదులు ఏవీ రాలేదని చెప్పారు.



బ్యాలెట్ బాక్సులను ఏసీ కళాశాలకు తరలించిన ఎన్నికల సిబ్బంది

లక్షా 5 వేల 614 మంది ఓటింగ్‌కు దూరం

● గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల్లోనే ఎక్కువ మంది
● ఓటు నమోదుకు ఉత్సాహంగా దరఖాస్తు
● తీరా నమోదైన తర్వాత ఓటు వేయని పట్టభద్రులు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల్లో ఏ విధంగా అయితే ఓటర్లు చైతన్యం ప్రదర్శిస్తారో అలాంటి వాతావరణం ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్‌లో కనిపించలేదు. ఈ నియోజకవర్గంలో ఓటర్లంతా విద్యావంతులే. డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదువులు పూర్తి చేసి మూడేళ్లకు పైగా అనుభవం గడించిన వారే. ఓటు వేయడం అనేది ప్రాథమిక హక్కు. ఈ విషయం పట్టభద్రులందరికీ కొత్తగా చెప్పాల్సిన పని లేదు. అయినప్పటికీ ఓటింగ్‌కు చాలామంది ఈ ఎన్నికల్లో దూరమయ్యారు. ఓటరు నమోదులో చూపించిన ఉత్సాహం పోలింగ్ సందర్భంగా ప్రదర్శించలేకపోయారు. ఓటర్ల సంఖ్య 3,47,116 ఉండగా, వీరిలో కనీసం మూడు లక్షల మంది అయినా ఓటు వేస్తారని అంతా భావించారు. అయితే 2,41,502 మంది మాత్రమే ఓటుహక్కుని వినియోగించుకొన్నారు. లక్షా 8 వేల 109 మంది ఓటర్లు కలిగిన గుంటూరు జిల్లాలో 71836 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొన్నారు. అలానే ఎన్‌టీఆర్ జిల్లాలో 78063 మంది ఓటర్లుంటే 51,279 మంది ఓటు వేశారు. కృష్ణాలో 63114 మంది ఓటర్లుంటే 44125 మంది ఓటు హక్కుని వినియోగించుకొన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ ఓటర్లు మరింత ఎక్కువ సంఖ్యలో ఓటు వేసి ఉంటే పోలింగ్ శాతం 75 వరకు చేరుకునేదే.

ఓటు ఇక్కడ... ఉద్యోగం వేరొక చోట

ఓటుహక్కు కలిగిన పట్టభద్రుల్లో చాలామందికి ఓటు ఇక్కడుండగా వాళ్ల ఉద్యోగ, వృత్తిరీత్యా నివాసం ఉంటున్నది వేరే ప్రాంతం కావడం పోలింగ్ శాతం ఎక్కువగా నమోదు కాకపోవడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఇక్కడి ఓటర్లు పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయడానికి ఇక్కడికి వచ్చేందుకు అంతగా ఆసక్తి కనబరచలేదు. కొంతమంది సిబ్బందికి కొన్ని డిపార్టుమెంట్‌లు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయలేదు. ఇది కూడా ఓటింగ్ పెరగకపోవడానికి కారణంగా విశ్లేషిస్తున్నారు.

ఉన్నతంగా ఎదగడమే అసలైన విజయం

● ఒలింపిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రెసిడెంట్ పీటీ ఉష
● ఎస్‌ఆర్‌ఎంలో ఘనంగా ఉద్గమ్ జాతీయ క్రీడోత్సవాలు


పీటీ ఉషకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తాము ఎంచుకున్న రంగంలో గొప్పగా రాణించి పతకాలు సాధిస్తే సరిపోదనీ, జీవితంలో ఉన్నతంగా ఎదిగినప్పుడే నిజమైన విజయం సాధించినట్టుని భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు, పద్మశ్రీ పీటీ ఉష అన్నారు. మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఉద్గమ్-25 జాతీయ క్రీడోత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీటీ ఉష క్రీడా జ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. కృషి, పట్టుదల, ఏకాగ్రత ఉంటేనే ఏ రంగంలోనైనా రాణించగలమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. క్రీడలతో విద్యార్థుల్లో సంఘటిత శక్తి పెరుగుతుందన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమించి క్రీడల్లో ప్రతిభ చూపడం వల్లనే తాను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నానని చెప్పారు. మంచి నడవడికతో తాము చదువుకున్న విశ్వవిద్యాలయానికి మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. వీసీ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఒలింపిక్స్‌లో వర్సిటీ విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ అనూప్‌సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ సునీత క్రీడల అభివృద్ధికి ఎస్‌ఆర్‌ఎం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ ఏడాది పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు రెండు వేల మందికి పైగా పాల్గొంటున్నారని తెలిపారు. వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. మార్చి ఒకటో తేదీన జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు రూ.పది లక్షల విలువైన బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ నుంచి క్రీడల్లో రాణిస్తున్న జెస్సీరాజ్ (స్కేటింగ్), బాలప్రసాద్‌రెడ్డి (రన్నింగ్), ఆకుల హైమలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ వినాయక్, సీఎఫ్ ఏవో సుమ, రీసెర్చ్ డీన్ రంజిత్, డైరెక్టర్ సిద్ధార్థ, రేవతీ బాలకృష్ణ, శ్రీపతి, వంశీ, విద్యార్థి సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టుని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం కె.సైమన్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ గతంలో ఉన్న షటిల్ కోర్టులో అనేక సమస్యలు ఉండటం వలన బ్యాడ్మింటన్ పోటీలకు అనువుగా ఉండేది కాదన్నారు. ఇప్పుడు చల్లని గాలి నిర్వహణతో ఎయిర్ వెంటిలేషన్ వ్యవస్థని అభివృద్ధి చేశామని, ఎల్‌ఈడీ లైటింగ్ సిస్టమ్‌ని మెరుగుపరిచామన్నారు. మోకాలి కుదుపుల విషయంలో ఆటగాళ్ల రక్షణ కోసం కోర్టు మొత్తం తొలగించి సరికొత్త రబ్బర్ కుషన్ టెక్నాలజీతో కలపను అమర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు ఎం.రవీంద్రనాథ్, సీహెచ్ ప్రదీప్‌కుమార్, జేవీ అనూష తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బడ్జెట్

● సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపుల పైనే ఆశలు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఏమేరకు కేటాయింపులు చేశారోనన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా గోదావరి - పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టుని గుంటూరు జిల్లాలో ముందుకు తీసుకెళ్లడానికి నిధులు ఎంతో అవసరం. అలానే గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ, నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు నిధులు అవసరం ఉంది. ఈ దఫా బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించే అవకాశాలున్నట్లు అంతా అంచనా వేస్తున్నారు. అమరావతి రాజధాని, అవుటర్ రింగురోడ్డు, నూతన రైలుమార్గం ప్రాజెక్టుకు కేంద్రమే నిధులు సమకూరుస్తుంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నూతన రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాజధాని రైతులు అమరావతి రాజధానికి కేటాయింపులు బాగుండాలని కోరుకుంటున్నారు. రోడ్లకు కొంతవరకైతే ప్యాచ్‌వర్కులు చేశారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదు. కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలకు నిధులు కేటాయిస్తేనే పనులు పురోగతిలోకి వస్తాయి.

ఆలపాటి గెలుపు తథ్యం: అనగాని

రేపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం ఎప్పుడో ఖాయమైందనీ, మెజార్టీ ఎంత వస్తుందనేది తేలాల్సి ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. జగన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందన్నారు. అసెంబ్లీకి రావటం జగన్‌రెడ్డికి ఇష్టం లేదనీ, బడుగు, బలహీన వర్గాలపై అతనికి ఎటువంటి ప్రేమలేదని విమర్శించారు. ప్రతిపక్ష హోదా లేకున్నా వెంకయ్య నాయుడు, సుందరయ్యలాంటి నాయకులు ప్రజల కోసం అసెంబ్లీలో పోరాటం చేశారన్నారు. జెమిలి ఎన్నికలే కాదు ఏ ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి ఘన విజయం వస్తుందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం ఏమీ లేదనీ, ఎవరు చేసిన పాపాలకు వారు అనుభవిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా వ్యక్తిగత దూషణలకు పాల్పడిన పోసాని మురళీ కృష్ణను చట్టపరంగానే అరెస్టు చేశారని అనగాని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లపై వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని పోసాని వినకూడని మాటలు అన్నారని ఆరోపించారు.

అక్రమాలపై విచారణ ప్రారంభం


బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేస్తున్న ప్రకాశం మెప్మా పీడీ పి.శ్రీహరి, టీమ్

బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మెప్మాలో వెలుగు చూస్తున్న అక్రమాలు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. మెప్మా ఎండీ తేజ్‌భరత్ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా మెప్మా పీడీ పి.శ్రీహరిని విచారణాధికారిగా నియమించారు. ఆయనతోపాటు మెప్మాలో పనిచేస్తున్న ఆరుగురు బృందం గురువారం విచారణ ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలకు రుణాలు ఇచ్చేందుకు కొత్త గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు ఇచ్చే విషయంలో అనేక అక్రమాలు జరిగినట్లు ఇప్పటికే పలువురు ఆరోపణలు చేస్తూ మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ బృందం బ్యాంక్‌లకు వెళ్లి ఎన్ని గ్రూపులకు రుణాలిచ్చింది, ఎంతమొత్తం ఇచ్చింది వివరాలు కావాలని కోరారు. అదే విధంగా వేలల్లో రుణాలిచ్చి లక్షల్లో బకాయిలు చూపిస్తున్నారంటూ ఫిర్యాదు చేసిన మేరీ ప్రసన్నకుమారిని పిలిపించి విచారించారు. తనకు కేవలం రూ. 10 వేలు మాత్రమే రుణం ఇచ్చారనీ, ఆ మొత్తం తిరిగి చెల్లించానని చెప్పారు. అయితే ఇంకా బ్యాంక్‌లో తాను సుమారు లక్షా 90 వేల రూపాయలు బకాయి ఉన్నట్లు చూపిస్తున్నారని వాపోయింది. ఈ విషయమై ఆర్‌పీలను పిలిపించి విచారించగా మేరీ ప్రసన్నకుమారికి ఇచ్చింది రూ. 10 వేలేననీ, మిగిలిన డబ్బులు గ్రూప్‌లీడర్ తీసుకుందని చెప్పారు. ఈ విధంగా గ్రూప్‌లో సభ్యులందరు ఎంతరుణం తీసుకున్నది తెలుసుకునేందుకు వారితో సమావేశం ఏర్పాటు చేయాలన విచారణాధికారి సూచించారు. పీడీ శ్రీహరి మాట్లాడుతూ ఆర్పీ రజియా, షాజిదాలను పిలిపించి విచారించినట్లు తెలిపారు. మేరీ ప్రసన్నకుమారికి రూ. 10 వేలు ఇచ్చి మిగిలిన డబ్బులు గ్రూప్‌లీడర్ కరీమా తీసుకున్నట్లు ఒప్పుకొని లేఖ రాసి ఇచ్చినట్లు తెలిపారు. ఈ విధంగా గ్రూప్‌లోని సభ్యులందరితో మాట్లాడి నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐవీ ఇన్‌గర్సల్‌బాబు, టిఈఏల్‌హెచ్ జయ్‌కుమార్, టీఈలు రాణి, ఫణికుమారి, ఎస్‌పీఎంయూ సునీల్, ఏవో వినీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.


సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 530.60 అడుగులు ఉంది. ఇది 169.32 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9076 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1500, ఎల్‌ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,889 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	83, 90, 100
చికెన్ విత్ స్కిన్	160.00
చికెన్ స్కిన్ లెస్	170.00



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పటిష్ట బందోబస్తు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు

● ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పటిష్ట బందోబస్తు మధ్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసింది. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని మంగళగిరి టౌన్, దుగ్గిరాల, తెనాలి 3 టౌన్, నగరంపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అక్కడి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో 149 బూత్‌లలో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. 8 ప్రదేశాలను, 29 పోలింగ్‌బూత్‌లను సున్నితమైనవిగా నిర్ధారించి అక్కడ అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని పోలింగ్‌ప్రదేశాలకు బ్యాలెట్ బాక్సుల తరలింపునకు 26 రూటులు ఉండగా ఒక్కో రూటుకు ఎస్సై స్థాయి అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించి, బందోబస్తు సిబ్బందిని నియమించామన్నారు.

వరుస బందోబస్తులతో నిద్రాహారాలు లేక పోలీసుల అవస్థలు

ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు.. మరోవైపు శివరాత్రి తిరునాళ్ళ బందోబస్తు.. ఇంకోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తు.. ఇలా వరుసగా మూడు రోజులు నిద్రాహారాలు లేక పోలీసులు అవస్థలు ఎదుర్కొన్నారు. కోటప్పకొండ, క్వారీ, అమరావతి, గోవాడ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా వేడుకలకు పెద్దసంఖ్యలో పోలీస్ సిబ్బందిని నియమించారు. కోటప్పకొండ తిరునాళ్ల బందోబస్తుకు గుంటూరు జిల్లా నుంచి కూడా సిబ్బందిని పంపారు. అసెంబ్లీ సమావేశాల బందోబస్తు సిబ్బందిని నేరుగా కోటప్పకొండకు పంపారు. ఆ సిబ్బంది వెంటనే ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తుకు హాజరుకావాల్సి రావడంతో ఇబ్బందిపడ్డారు. ఇది ముగియగానే శుక్రవారం తిరిగి అసెంబ్లీ సమావేశాలకు బందోబస్తు విధులకు వెళ్ళాల్సిరావడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది ఒత్తిడికి గురవుతున్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించి పోస్టులు భర్తీ చేయాలి

గుమ్మా శ్రీనివాస్‌యాదవ్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో వయోపరిమితి దాటిన నిరుద్యోగ అభ్యర్థులకు వయోపరిమితి పెంచాలని కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ కోరారు. టార్గెట్ ఐఏఎస్ అకాడమీలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 16వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకత చూపించాలని కోరారు. ఏపీపీఎస్సీ మొత్తాన్ని కూడా ప్రక్షాళన చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పోటీ అభ్యర్థిగా 11 మ్యానిఫెస్టో అంశాలను ఆవిష్కరించానని, వాటిల్లో ప్రభుత్వం నుండి సాధించాల్సిన అంశాలను పోరాటం ద్వారా సాధిస్తానన్నారు.

ఉద్యోగులకు అభియోగాలు లేని పదవీ విరమణ అవసరం

● సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖలలోని ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలో ఎలాంటి తప్పులు, అభియోగాలు లేకుండా ఉద్యోగవిరమణ చేయడం అదృష్టంగా భావించాలని సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. కన్నావారితోటలోని జీఎస్‌టీ భవన్‌లో సూపరింటెండెంట్ పోగుల ఆషా ఉద్యోగ విరమణ సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో జరిగే పొరపాట్ల వల్ల పలు శాఖల్లోని ఉద్యోగులు విజిలెన్స్ కేసులు ఎదుర్కొంటున్నారని, అవి పరిష్కారం అయ్యేసరికి పదవీకాలం కూడా ముగుస్తుందన్నారు. కొన్ని కేసులు రిటైర్మెంట్ తర్వాత కూడా వేధిస్తాయన్నారు. ఉద్యోగులందరూ విధినిర్వహణలో ఎలాంటి అభియోగాలు, లోపాలు లేకుండా పనిచేయాలని సూచించారు. పదవీవిరమణ చేస్తున్న ఆషా తన సర్వీసులో పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేశారని కమిషనర్ కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ బీ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు వీవీ రావు, నాగరాజు, రవికుమార్, మనోజ్‌కుమార్, రాయలు, సీతారామ రాజు, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చిదేళ్ల ఈశ్వరరావు, చిట్టే వెంకట్, పెన్షనర్ల సంఘ నాయకులు రాజేశ్వరరావు, గుమ్మడి సీతారామ య్య చౌదరి, పీవీ సత్యనారాయణ, పీ కోటేశ్వరరావు, సామ్రాజ్యం తదితరులున్నారు.

రమణీయం.. రథోత్సవం

● అశేషంగా తరలివచ్చిన భక్త జనులు
● భక్తులతో కలిసి రథం లాగిన మంత్రి లోకేశ్



భక్తులతో ముందుకు సాగుతున్న మంగళగిరిలోని మల్లేశ్వరస్వామి రథోత్సవం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం మంగళగిరిలో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివార్ల దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. రెండు వైష్ణవాలయాల నడుమ మంగళగిరి మెట్ల మార్గంలోని శివాలయంలో బుధవారం అర్ధరాత్రి స్వామివార్ల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన రథోత్సవం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు కొనసాగి తిరిగి అదేమార్గంలో రథశాలను చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మెయిన్ బజారు, అనుబంధ వీధులు కిక్కిరిసిపోయాయి. పురవీధులన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. మల్లేశ్వరస్వామి రథోత్సవానికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు దేవస్థానం అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రథోత్సవానికి ముందు శివాలయం ప్రధాన అర్చకుడు తెలిదేవరపల్లి మహేష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం మంత్రి లోకేశ్ భక్తులతో కలిసి కొద్ది దూరం రథం లాగారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, దేవదాయశాఖ సహాయ కమిషనరు అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస రావు, శివాలయం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ గంజి చిరంజీవి, బోగి వినోద్, మన్నెం రమేష్‌బాబు, గోసాల రాఘవ, రంగిశెట్టి పెద్ద బ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవానికి ముందు పూజల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్



భక్తులతో కలిసి రథం లాగుతున్న మంత్రి నారా లోకేశ్

విశ్వేశ్వరస్వామికి లోకేశ్ పూజలు

మంగళగిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కృష్ణాయపాలెం గ్రామంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవ స్థానాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కృష్ణాయపాలెంలో విశ్వేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి నారా లోకేశ్

ఆలపాటిదే గెలుపు: ఎమ్మెల్యే గళ్లా మాధవి

● ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే





స్టాల్ గర్ల్స్ హైస్కూలులో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఓటువేసి వస్తున్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



లూర్దు హైస్కూల్లో ఎమ్మెల్యే ఆనందబాబు...



జాయింట్ కలెక్టర్ భరత్ తేజ...



కమిషనర్ పులి శ్రీనివాసు దంపతులు...

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించబోతున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి ధీమా వ్యక్తం చేశారు. గుంటూరు స్టాల్ గర్ల్స్ హైస్కూల్ నందు గురువారం ఆమె ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం నియోజకవర్గంలో ఉన్న కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిసిలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలపాటి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగిందని, అధికారుల ఏర్పాట్లు బాగున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సింహాద్రి కనకాచారి, లాం వర్ధన్, గంటా పెద్ద బ్బాయి, సాధు రాజేష్, డివిజన్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



● లూర్దు హైస్కూలులో ఓటు వేసిన ఆనందబాబు

స్థానిక లూర్దు హైస్కూలులో మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు ఆలపాటికే పట్టం కడతారని ఈ సందర్భంగా ఆనందబాబు ధీమా వ్యక్తం చేశారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 61.88 శాతం పోలింగ్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజవవర్గానికి సంబంధించి మొత్తం 11 బూత్‌లలో పోలింగ్ జరగ్గా అందులో ప్రత్తిపాడు మండలంలోని రెండు బూత్‌లలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. ప్రత్తిపాడులోని 256, 257 పోలింగ్ బూత్‌లలో 71.51 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం నియోజకవర్గంలో 10294 మంది బట్టబద్రుల ఓట్లు ఉండగా అందులో 6370 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా నియోజకవర్గంలో పోలింగ్ 61.88 శాతంగా నమోదైంది.

స్లిప్పులు రాసి పంపిణీ చేసిన ఎమ్మెల్యే బూర్ల

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు నియోజకవర్గంలో జరుగుతున్న పట్టభద్రుల ఎన్నికలను పరిశీలించారు. ప్రతి మండలాన్ని తిరుగుతూ అక్కడ పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ క్రమంలో ప్రత్తిపాడు పోలింగ్ బూత్ సమీపంలో కూటమి నేతలు ఏర్పాటు చేసిన పోలింగ్ క్యాంపును ఆయన సందర్శించి ఓటర్లకు ఆయనే స్వయంగా స్లిప్పులు రాసి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, అయినంపూడి నాగేశ్వరరావు, కొర్రపాటి మధు, మాకినేని జగన్ తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరులో ప్రశాంతంగా పోలింగ్

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వట్టి చెరుకూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వట్టిచెరుకూరు సీఐ రమానా య క్, ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గింజుపల్లి వెంకటేశ్వరరావు తదితరులతో కలసి జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో పోలింగ్ సరళిని పరి శీలించారు. తొలుత ఎమ్మెల్యే ఓటర్లకు సంబంధించి స్లిప్‌లను స్వయంగా రాసి ఓటర్లకు అందజేశారు. 9 గంటల సమయంలో అనంతవరప్పాడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు నర్రా శిరీష ప్రత్యేక వాహనంలో కేంద్రానికి చేరుకోగా పోలింగ్ సిబ్బంది, పోలీసులు ఆమెను వీల్ ఛైర్‌లో పోలింగ్ బూత్‌లోకి తీసుకొని వెళ్లి ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేశారు. మండలంలో 64.39 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పెదనందిపాడులో 66.7 శాతం పోలింగ్

పెదనందిపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలోని రెండు పోలింగ్ బూత్‌ల్లో 1603 ఓట్లకు గాను 1070 ఓట్లు పోలైనట్లు, 66.7శాతం ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తహసీల్దార్ శంకర్‌బాబు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మధుపవన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కాకుమాను మండలంలో 68.40శాతం

కాకుమాను ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో 68.40 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 1076 ఓట్లు ఉండగా 736 ఓట్లు పోలయినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. ఓటింగ్ సరళిని డీఎస్పీ భానోదయ, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్, రెవిన్యూ అధికారులు పర్యవేక్షించారు. మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్, నక్కల శైలజ, అగస్టీన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కూటమి అభ్యర్థిదే విజయం : ఎమ్మెల్యే

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధిస్తారని స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. గురువారం కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్‌చౌదరి, కొల్లా వీరయ్య చౌదరి, మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణచంద్రరావు, అగస్టీన్ తదితరులున్నారు.

నేడు పట్టాభిపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

క్వారీ తిరునాళ్ల ఆదాయం రూ.16 లక్షలు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి రూ.16 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో రామకోటేశ్వరరావు తెలిపారు. గురువారం భక్తుల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఆలయం వద్ద ఉన్న మూడు హుండీల ద్వారా రూ.6,72,636 ఆదాయం సమకూరింది. పూజా టికెట్లు, లడ్డూల విక్రయం ద్వారా రూ.6,86,195 ఆదాయం సమకూరింది. కొబ్బరిచిప్పలు, తదితర పూజల ద్వారా రూ.2,88,800 ఆదాయం సమకూరింది. మొత్తం దేవాలయానికి రూ.16,37,631 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర లింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో వేంచేసివున్న గంగా పార్వతి సమేత సహస్ర లింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం అర్ధరాత్రి భక్తిశ్రద్ధలతో జరిగింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై గంగా పార్వతి సమేత సహస్ర లింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సహస్ర లింగేశ్వరస్వామి కల్యాణ క్రతువును అర్చక స్వాములు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



నేల వాలిన తాళ్లపాలెం విద్యుత్ ప్రభ

శివరాత్రి తిరునాళ్లలో అపశ్రుతి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాలలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. మండల పరిధిలోని కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామ శివార్లలోని సంగమేశ్వరస్వామికి గ్రామస్థులు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. ప్రభల ఉత్సవం సందర్భంగా తాళ్లపాలెం గ్రామస్థులు 70 అడుగుల భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటుచేశారు. ఆలయం వద్దకు భక్తులు ప్రభను చేర్చే క్రమంలో రహదారి గోతులమయంగా ఉండటంతో కొద్ది దూరంలో ఆలయం ఉందనగా ప్రభ పక్కకు ఒరిగిపోయింది. గ్రామ యువత ప్రభను నిలబెట్టేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వ్యయప్రయాసలకు ఓర్చి భక్తిశ్రద్ధలతో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ నేలకు ఒరగడంతో భక్తులు ఆవేదన చెందారు. ప్రభ నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రభ సమీపంలోని పంట పొలాల వైపు ఒరిగి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు.

డాక్టర్ నాగభైరవ సాహిత్య సౌరభాలు అజరామరం

● ప్రముఖ విద్యావేత్త పెంట్యాల శ్రీమన్నారాయణ



సాహితీవేత్తలను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ కవి, కవిరత్న, డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు కలం నుండి జాలువారిన సాహితీ సౌరభాలు వర్తమాన, భవిష్యత్ రచయితలకు, సాహితీవేత్తలకు దిక్సూచి వంటివని ప్రముఖ విద్యావేత్త పెంట్యాల శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత, కళారత్న డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు సాహిత్య పురస్కార సభ పలువురు రచయితలు, సాహితీవేత్తల సమక్షంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై డాక్టర్ నూనె అంకమ్మరావు, డాక్టర్ సెట్లం చంద్రమోహన్‌లకు డాక్టర్ నాగభైరవ సాహిత్య పురస్కారాలు అందజేశారు. సభకు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు అధ్యక్షత వహించగా దేవస్థానం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నవ్యాంధ్ర తెలుగు రచయిత్రుల సంఘం అధ్యక్షులు తేళ్ల అరుణ, రచయిత, సంపాదకులు మోదుగుల రవికృష్ణ, ప్రజాగాయకుడు నూకతోటి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పులో 59.43... పశ్చిమలో 62.85 శాతం పోలింగ్

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సాధారణ ఓటర్లు చూపిం చినంత చైతన్యం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు చూపలేకపోయారు. ఓట్ల నమోదులో చూపించిన ఉత్సాహం పోలింగ్ సందర్భంగా చూపలేదు. గురువారం జరిగిన కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుంటూరు తూర్పులో మొత్తం 21 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఇక్కడ 15,845 మంది ఓటర్లున్నారు. వీళ్లలో 9417 మంది ఓటుహక్కు వినియోగించుకోవడంతో పోలింగ్ శాతం 59.43గా నమోదైంది. గుంటూరు పశ్చిమలో 42 పోలింగ్ బూత్‌లుండగా మొత్తం ఓటర్లు 25937 మంది ఉన్నారు. వీరిలో 16,301 మంది ఓటుహక్కు వినియోగించు కోవడంతో పోలింగ్ శాతం 62.85గా నమోదైంది.

తాడికొండ నియోజకవర్గంలో 72.26 శాతం

● పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్
● ఓటు హక్కు వినియోగించుకున్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి

తాడికొండ, ఫిబ్రవరి 27: కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ జరిగింది. 4 గంటలకు తరువాత క్యూలో ఉన్న ఓటర్లకు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి అధికారులు అవకాశం కల్పించారు. నియోజకవర్గంలో 72.26శాతం నమోదైంది. నియోజకవర్గంలో 8709 ఓట్లు ఉండగా 6293 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 8 గంటలకే పోలింగ్‌కేంద్రాలకు ఓటర్లు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దివ్యాంగులు, చంటి బిడ్డలతో మహిళలు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పోలింగ్ సరళిని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా ఓటు హక్కును వినియోగించుకోవటానికి వచ్చిన ఓటర్లు తమతో పాటు గుర్తింపు కార్డుల జిరాక్సులు తీసు కువచ్చారు. మధ్యాహ్నం 3గంటల వరకు గుర్తింపు కార్డులు జిరాక్సులు చూపించిన ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనుమతి ఇచ్చిన పోలింగ్ అధికారులు, ఆ తరువాత జిరాక్సులు అనుమతించమని తిప్పి పంపించారు. దీంతో టీడీపీ నాయకులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న తహసీల్దార్ జిరాక్సులపై అటెస్టేషన్ చేస్తామని చెప్పి సంతకాలు చేసి పంపటంతో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఫిరంగిపురంలో 69 శాతం పోలింగ్

ఫిరంగిపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 205, 206, 206ఏ పోలింగ్ బూత్‌లలో మొత్తం 69 శాతం ఓటింగ్ గురువారం జరిగిందని తహసీ ల్దార్ కే ప్రసాదరావు తెలిపారు. మండలంలో మొత్తం పట్టభద్రుల ఓట్లు 2074 ఉండగా 1431 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. మధ్యాహ్నం 11 గంటలకు జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ వచ్చి ఓటర్లను, బీఎల్‌వోలను, పోలింగ్ అధికా రులను, ఏజెంట్లను వసతుల గురించి అడిగి తెలుసుకొని పోలింగ్ సజావుగా జరిగే లా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ అనంతరం ఎమ్మెల్యే వచ్చి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. కూటమి నాయకులు కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి నృసింహుని వార్షిక బ్రహ్మోత్సవాలు



నృసింహుడి బ్రహ్మోత్సవాల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల తాలూకా గోడప్రతులు, ఆహ్వాన పత్రికలను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 13వ తేదీ అర్ధ రాత్రి నృసింహుని కల్యాణం, 14వ తేదీన దివ్యరథోత్సవం జరుగనున్నాయి. ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొనవలసినదిగా దేవస్థానం అధికారులు మంత్రి లోకేశ్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ఉపప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిపుచ్చుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ నెలకోసారి సమావేశమై.. పరిస్థితిని సమీక్షించుకుందాం' అని జైన్ ఈ సందర్భంగా సలహా ఇచ్చారు. వరద సమయంలోనూ పోతిరెడ్డిపాడు నుంచి నీటిని ఏపీ వాడుకుందని.. కేసీ కెనాల్ ద్వారా కూడా నీటిని వాడుకుందని గతంలో చేసిన ఆరోపణలనే తెలంగాణ ప్రస్తావించింది. నాగార్జున సాగర్ నుంచీ వాడేసుకుందని తెలిపింది. ఈ వాదనలను ఏపీ తీవ్రంగా ఖండించింది. వరద నీరు సముద్రంలోకి వెళ్తుంటే రాష్ట్రావసరాలకు వాడుకున్నామని పునరుద్ఘాటించింది. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తీసుకున్నా.. ఆ తర్వాత పై నుంచి వచ్చిన వరద కారణంగా శ్రీశైలం జలాశయం నిండినందున.. 20 టీఎంసీల నష్టం వాటిల్లిందన్న వాదనలోనూ పస లేదంది. శ్రీశైలం, సాగర్‌లలో విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు నీటిని వదిలి సముద్రంపాలు చేసింది తెలంగాణేనని ఆక్షేపించింది. దీంతో చైర్మన్ జోక్యం చేసుకుని.. గతంలో జరిగినవి ఇప్పుడు అప్రస్తుతమన్నారు. ప్రస్తుతం సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఏపీకి వదులుతున్న ఏడు వేల క్యూసెక్కులు.. తెలంగాణ కోసం వదులుతున్న తొమ్మిది టీఎంసీలు.. పంటలను కాపాడుకోవడానికి సరిపోతాయో లేదో ఈఎన్‌సీల స్థాయిలో చర్చించుకోవాలన్నారు. ఉన్న నీటిని పంటలకు సర్దుకోవడం.. తాగునీటి అవసరాలు తీర్చుకోవడంపై దృష్టి సారించాలని, ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ, హంద్రీ-నీవా నీటినీ సమీక్షించుకోవాలని సూచించారు. నెల తర్వాత కార్యదర్శుల స్థాయిలో మాట్లాడుకుని.. అవసరాలకు అనుగుణంగా సాగర్‌లో అందుబాటులో ఉన్న జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వాడుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాల సీఈల కమిటీ జూన్ వరకు ఏపీకి 55, తెలంగాణకు 63 టీఎంసీలు అవసరమంటూ ఇచ్చిన నివేదిక పైనా చర్చించారు. అనంతరం చైర్మన్ సూచన మేరకు ఈఎన్‌సీలు వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్ సమావేశమై సుహృద్భావ వాతావరణంలో చర్చించుకున్నారు. పంటల రక్షణకు సాగర్ కుడి కాలువ నుంచి 7 వేల నుంచి 8 వేల క్యూసెక్కులు.. ఎడమ కాలువ నుంచి 7 వేల క్యూసెక్కులను వాడుకోవాలని నిర్ణయించారు. శ్రీశైలం జలాల వాడకంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిచ్చేందుకు అంగీకరించారు.



100 రోజులు.. 1,596 మి. యూనిట్లు

- రికార్డు స్థాయిలో కృష్ణపట్నం మూడో యూనిట్ ఉత్పత్తి
- ఒక్కరోజే 4.949 మిలియన్ యూనిట్లు
- అద్భుతం సృష్టించిన సీలేరు జల కేంద్రం

అమరావతి, సీలేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జెన్కో విద్యుదుత్పత్తి సంస్థలు రికార్డు స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి. కృష్ణపట్నం దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రం మూడో యూనిట్‌లో వంద రోజులుగా నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరుగుతూ 1596.30 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించింది. ఇక.. సీలేరు జల విద్యుత్ కేంద్రం 24 గంటల వ్యవధిలోనే రికార్డుస్థాయిలో 4.949 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేసింది. ఇది ఈ కేంద్రం చరిత్రలోనే ఆల్ టైమ్ రికార్డు. ఆ వివరాలను జెన్కో గురువారం వెల్లడించింది. వేసవిలో విద్యుత్తు కొరత రానీయకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు వెల్లడించారు. జెన్కో విద్యుత్తు కేంద్రాలు 2025 జనవరి నుంచి ఇప్పటిదాకా సగటున 110 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయని చెప్పారు. ఈ నెల 22వ తేదీన 123 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామన్నారు. నార్ల తాతారావు థర్మల్ విద్యుత్కేంద్రం నుంచి తొలిసారిగా 95 మిలియన్ యూనిట్లను ఈ నెల 18న ఉత్పత్తి చేశామని తెలిపారు.

నెలరోజుల ముందుగానే లక్ష్యఛేదన

సీలేరు జల విద్యుత్ కేంద్రం ఉత్పత్తిలో లక్ష్యాన్ని అధిగమించిందని జెన్కో ఈఈ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యం 477 మిలియన్ యూనిట్లకు గాను గురువారం (27వ తేదీ) ఉదయం నాటికి 477.644 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని అధిగమించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు జల విద్యుత్ కేంద్రం ఇంజనీర్లను, సిబ్బందిని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఈలు (ఓ అండ్ ఎం) చిన్న కామేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

కరెంటు కొనుగోలు బకాయి 6,556 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు బకాయిలు రూ.6,556.25 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో గత నెల బకాయిలు రూ.1,873. కోట్లు దానికిముందు రెండు నెలల బకాయిలు రూ.4,653.24 కోట్లు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'ప్రాప్తి' పోర్టల్ వెల్లడించింది. తక్షణమే ఈ బకాయిలు చెల్లించాలని ఏపీపీసీసీని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కోరింది.

డిస్కమ్‌ల బలోపేతానికి సహకారం అందించండి

- సీమలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కోరిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లను ఆర్థికంగా బలోపేతం చేయాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం నిరంతరం కావాల్సిందేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గురువారం రాష్ట్రాల ఇంధన శాఖల కార్యదర్శులు, మంత్రులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో బిజీగా ఉన్న గొట్టిపాటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రాయలసీమలో సోలార్, పవన, పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ పథకాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే కరెంటును రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర సహకారాన్ని కోరగా, కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈ సమావేశంలో కార్యాచరణను ప్రకటిస్తామని ఖట్టర్ వెల్లడించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రెట్రోను అందిస్తున్న సితార



విభిన్న పాత్రలు, చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న తమిళ హీరో సూర్య తాజా చిత్రం 'రెట్రో'. మే ఒకటిన విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఒకవైపు వరుసగా సినిమాలు నిర్మిస్తూ భారీ విజయాలను అందుకుంటున్న ఈ సంస్థ మరో వైపు పంపిణీరంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. సూర్య తెలుగు అభిమానులు థియేటర్లలో పండగ చేసుకొనేలా 'రెట్రో' విడుదలకు ఈ సంస్థ ప్లాన్ చేస్తోంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న 'రెట్రో'లో పూజా హెగ్డే కథానాయిక. సూర్య, జ్యోతిక నేతృత్వంలో 2డి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. జోజు జార్జ్, జయరామ్, నాజర్, ప్రకాశ్‌రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న 'రెట్రో' చిత్రానికి సంబంధించి ఇప్పుడు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

జూన్‌లో వస్తున్న కుబేరుడు



ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర'. ఈ ఏడాది జూన్ 20న తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మేరకు రిలీజ్ డేట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పోస్టర్‌లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా నిలబడి ఒకరిని మరొకరు తీక్షణంగా చూస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది.

విష్ణు నమ్మకమే శివుడి పాత్ర చేయించింది

-అక్షయ్ కుమార్



'శివుడి పాత్ర చేయాలంటూ ఆఫర్ వచ్చినప్పుడు నేను రెండు సార్లు తిరస్కరించాను. కానీ విష్ణు వదల్లేదు. భారతీయ సినీ ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను' అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నాతో ఆ పాత్ర చేయించింది. కన్నప్ప కథ చాలా శక్తిమంతమైంది. విజువల్ వండర్‌గా ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో నేనూ భాగమవడం గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. డాక్టర్ మోహన్‌బాబు తన తనయుడు విష్ణు మంచుతో ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో నిర్మించిన 'కన్నప్ప' టీజర్‌ను ముంబైలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ్‌కుమార్ మాట్లాడారు. హీరో విష్ణు మాట్లాడుతూ 'కన్నప్ప కేవలం నాకు ఓ సినిమా కాదు.. నా జీవన ప్రయాణం. కన్నప్ప కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఈ ప్రయాణంలో అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలు మాతో చేరడం ఆనందంగా ఉంది. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అందరి దృష్టినీ ఆకట్టుకొన్న టీజర్‌ను మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం. ఏప్రిల్ 25న 'కన్నప్ప' విడుదలవుతుంది' అని చెప్పారు.



పూజా హెగ్డే ప్రత్యేక గీతం

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే నటిస్తున్నారు. ఆమె లుక్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. బుధవారం 'ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టండి' అంటూ ఓ ప్రీలుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ ప్రకటించింది. అయితే, ఈ మూవీలో పూజా హెగ్డే కీలక పాత్రను పోషిస్తున్నారా? లేక స్పెషల్ సాంగ్‌లో నర్తిస్తున్నారా? అనేది తెలియాల్సివుంది. 'జైలర్' సినిమాలో హీరోయిన్ తమన్నా 'కావాలయ్యా' పాట తరహాలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ గీతంలో నర్తించేందుకు పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు అభిమానులు భావిస్తున్నారు. ఈ మూవీలో ఆమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఇది పైసా వసూల్ సినిమా

- సందీప్ కిషన్



'మజాకా' చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇది పైసా వసూల్ సినిమా. అందరూ థియేటర్లలోనే చూడండి' అని హీరో సందీప్ కిషన్ కోరారు. ఆయన కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన 'మజాకా' చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు' అని అన్నారు. త్రినాథరావు మాట్లాడుతూ 'ప్రేక్షకుల స్పందన చూస్తుంటే మేం సక్సెస్ అయ్యాం అనిపించింది' అని తెలిపారు.

ఆస్ట్రేలియాలో షూట్ చేశాం


- విరాజ్ రెడ్డి



విరాజ్‌రెడ్డి చీలం కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'గార్డ్'. జగ పెద్ది దర్శకత్వంలో అనసూయ రెడ్డి నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా విరాజ్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ అంతా ఆస్ట్రేలియాలో చేశాం. ఒక సెక్యూరిటీ గార్డ్ జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా సినిమా ఉండబోతోంది. కథానుసారం అన్ని రకాల ఎమోషన్స్ పలికించడం నటుడిగా నాకు సవాల్ అనిపించింది" అని చెప్పారు.

అప్‌డేట్స్

ఆ వాహనం కథేంటి?



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వి మేఘన, నిహాల్ కోధాటి ముఖ్య తారలుగా సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 21న విడుదల కానుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ 'న్యూ ఏజ్ స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది. ఇందులో ఉండే స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యాజికల్ పవర్స్‌ను కలిగి ఉంటుంది. అందరూ ఆ వాహనం ప్రేమలో పడిపోతారు. యువతరానికి నచ్చే అంశాలతోపాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కథలో ఆ స్కూటర్ కమ్ ఆటో పాత్ర ఏంటి అనేది సినిమాలో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు.

తెలుగు తెరకు కొత్త గ్లామర్



టాలీవుడ్ స్క్రీన్‌కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతుంది. 'సర్కార్ నౌకరి ఫేమ్', గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా శివ దర్శకత్వంలో తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత తాటి బాలకృష్ణ, నిర్మిస్తున్న చిత్రంలో భైరవి కథానాయికగా పరిచయం అవుతున్నారు. 'ఈ మూవీని విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రం ఇది' అని నిర్మాత తాటి బాలకృష్ణ తెలిపారు.

నేర పరిశోధన నేపథ్యంలో



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'అబ్సెషన్'. రాకేశ్ శ్రీపాద దర్శకత్వంలో రవి నాలమ్ నిర్మిస్తున్నారు. గురువారం కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్ చేతుల మీదుగా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హరీశ్ వినయ్, వి. ధీరజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనీశ్ రాజ్ దేశ్‌ముఖ్, సినిమాటోగ్రఫీ: వనిధర్‌రెడ్డి

5 నుంచి నృసింహుని వార్షిక బ్రహ్మోత్సవాలు



నృసింహుడి బ్రహ్మోత్సవాల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల తాలూకా గోడప్రతులు, ఆహ్వాన పత్రికలను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 13వ తేదీ అర్ధ రాత్రి నృసింహుని కల్యాణం, 14వ తేదీన దివ్యరథోత్సవం జరుగనున్నాయి. ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొనవలసినదిగా దేవస్థానం అధికారులు మంత్రి లోకేశ్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ఉపప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామికి లోకేశ్ పూజలు



కృష్ణాయపాలెంలో విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కృష్ణాయపాలెం గ్రామంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏజెంట్లు బెదిరింపులకు పాల్పడ్డారంటూ ఫిర్యాదు

దుగ్గిరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని జడ్పీబాలురోన్నత పాఠశాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తమపై బెదిరింపులకు పాల్పడినట్లు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున పాల్గొన్న ఇద్దరు ఏజెంట్లు తహసీల్దార్ ఐ సునీతకు ఫిర్యాదు చేశారు. 286వ బూత్‌లోనూ, 288వ నెంబర్ బూత్‌లోనూ, టీడీపీ ఏజెంట్లుగా ఉన్న వ్యక్తులొకరు తమను బెదిరించారని, దొంగ ఓట్లు వేసే ప్రయత్నించారని ఏజంట్లు జీ శ్రీనివాసరావు, ఎం నరసింహారావులు తహసీల్దార్ ఐ సునీతకు చేసిన ఫిర్యాదులో పేర్కొ న్నారు. తమను పోలీసులు, అన్యాయంగా బూత్ నుంచి బయటకు తీసుకెళ్లార ని, సీసీ ఫుటేజ్ ఆధారంగా సదరు ఏజెంట్లపైన, సహకరించిన సిబ్బందిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 416 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 416 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.5 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 66 క్యూసెక్కు ల నీరు, తూర్పుకాల్వకు 48, పశ్చిమకాల్వకు 120, నిజాంపట్నం కాల్వకు 60, కొమ్మమూరుకాల్వకు 170 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

అన్న ప్రసాదాల పంపిణీ



శివాలయం వద్ద తీర్థప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

మంగళగిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో 18వ అన్న సమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ట్రస్టు చైర్మన్ వాకా మంగారావు, ప్రధాన కార్యదర్శి డోకిపర్తి శ్రీనివాసరావు, కోశాధికారి మునగపాటి వెంకటేశ్వరరావు, బట్టు కోటయ్య, కఠారి వెంకటేశ్వరరావు, మొగిలిచర్ల సత్యం, గొర్రె సత్యనారాయణ, మునగాల వెంకట దుర్గారావు, తాయి నాగార్జున తదితరులు పాల్గొన్నారు. డీబీఎన్ గ్రూపు సంస్థల చైర్మన్ దేవతి భగవన్నారాయణ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. దేవతి పద్మజ, రంజిత్, లక్ష్మీ జ్యోత్స్న, నటుకుల శ్రీరామ్, సాయి హేమాంజలి తదితరులు పాల్గొన్నారు. పీఈపీఎల్ సేవా ట్రస్టు చైర్మన్ పితాళ్ల మస్తాన్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు పాలతాలికలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తోట నాని, దామర్ల తారకనాథ్, రాజశేఖర్, సత్యనారాయణ, ప్రగడ శ్రీను తదితరులు పాల్గొన్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో పటాలంలో అమరలింగేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా గురువారం అన్నదానం చేశారు. పటాలం కమాండెంట్ కే.నగేష్‌బాబు, అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, సిబ్బంది పాల్గొన్నారు.

1000 మందికి అన్నదానం



శ్రీసోమేశ్వర స్వామి దేవాలయంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా సీతానగరం సోమేశ్వరస్వామి దేవస్థానంలో అంబటి తిరుపతిరావు, అంబటి వెంకటేశ్వరరావు, అంబటి రఘురాముడు ఆధ్వర్యంలో గురువారం 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ మెడికల్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి అంబటి వారు శివరాత్రి సందర్భంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంబటి తిరుపతిరావు, మునగపాటి మారుతీరావు, మధు, సామల నాగేశ్వరరావు, బడే కోమలి, శివ నాగేంద్రం, సిద్దె రఘుబాబు, నానాజీ మల్లి, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, టంకసాల ఈశ్వరనాయుడు, వల్లూరు శివ తదితరులు పాల్గొన్నారు.

హత్యచేసి.. ఆత్మహత్య చేసుకున్నాడు

- భార్య వివాహేతర సంబంధమే కారణం
- సూసైడ్ నోట్‌లో వెల్లడి.. కేసు నమోదు

దుగ్గిరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓవ్యక్తితో వివాహేతర సంబంధం కొన సాగిస్తున్నందునే భార్యను హత్య చేశానని, అనంతరం తానూ ఆత్మహత్యకు పాల్పడ్డానని భర్త చనిపోయే ముందు రాసిన లేఖలో పేర్కొన్నాడని ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు. రేవేంద్రపాడులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొక్కినాల సురేష్, భార్య శ్రావణిని మంగళవారం హత్య చేసి, బుధవారం మధ్యాహ్నం అతనూ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. వల్లభాపురంనకు చెందిన సురేష్ తండ్రి కోటేశ్వరరావు అలియాస్ అబ్రహం, తన కుమారుడు ఉంటున్న అద్దె ఇంట్లో లభించిన లేఖను పోలీసులకు గురువారం అందించాడు. భార్యాభర్తల మృతదేహాలను ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఘటనా స్థలంలో లభించిన ప్రాథమిక సాక్ష్యాల ఆధారంగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- మంగళగిరి అర్బన్, రూరల్‌లో 68.55 శాతం నమోదు
- దుగ్గిరాలలో ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలన



డిగ్రీ కళాశాలలో ఎన్నికల విధుల్లో నిమగ్నమైన పోలింగ్ సిబ్బంది

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మంగళగిరిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 8 గంటల నుంచే పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. మంగళగిరి అర్బన్ ప్రాంతంలోని ఓటర్లకు వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఆరు పోలింగ్ బూత్‌లు, రూరల్ ప్రాంతంలోని ఓటర్లకు సీకే జూనియర్ కళాశాలలో ఐదు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతం కంటే రూరల్ ప్రాంతంలోని ఓటర్లే ఎక్కువ శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అర్బన్ ప్రాంతంలో మొత్తం 4,537 ఓట్లకు గాను 3,035 ఓట్లు పోలవ్వగా, 66.89 శాతం పోలింగ్ నమోదైంది. రూరల్ ప్రాంతంలో మొత్తం 3,624 ఓట్లకు గాను 2,545 ఓట్లు పోలవ్వగా, 70.22 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా మంగళగిరి అర్బన్, రూరల్ కలిపి 68.55 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధానంగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్య పోటీ నెలకొంది. మంగళగిరి మిద్దె సెంటరులో ఇరువురు అభ్యర్థుల తరపున శిబిరాలు ఏర్పాటు చేసి ఓటర్లకు స్లిప్పులు పంచారు. ఇరు వర్గాలు కవ్వింపు చర్యలకు పాల్పడడంతో పలుమార్లు స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో అర్బన్, రూరల్ సీఐలు డి.వినోద్‌కు మార్, వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రా ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాడేపల్లిలో 74శాతం ఎమ్మెల్సీ పోలింగ్

తాడేపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండల, పట్టణ ప్రాంతాల్లో గురువారం ప్రశాంతం గా ముగిసింది. తాడేపల్లి అర్బన్‌లో ముగ్గురోడ్ పాఠ శాల, క్రిస్టియన్ పేట పాఠశాల, రూరల్ పరిధిలో ఉండవల్లిలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠ శాలలో 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అర్బన్ పరిధిలో 4 పోలింగ్ కేంద్రాల్లో, రూరల్ పరిధిలో 4 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 5515 మంది ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు ఉన్నారు. వారిలో 4079 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా 74 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ సీతారామయ్య తెలిపారు.



దుగ్గిరాలలో చంటిబిడ్డలతో ఓటువేయడానికి వచ్చిన మహిళలు

దుగ్గిరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ అన్నారు. దుగ్గిరాలలోని జడ్పీ బాలురో న్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను ఎస్పీ గురువారం తనిఖీ చేశారు. ఏఈఆర్‌వో ఐ సునీతను ఎన్నికల జరుగుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. దుగ్గిరాలలో జడ్పీ బాలురోన్నత పాఠశాల లో పట్టభద్రుల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మూడు పోలింగ్ కేంద్రాల్లో 2254 మంది ఓటర్లకు గానూ, 1691 మంది తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నట్లు ఏఈఆర్‌వో ఐ సునీత తెలిపారు. మొత్తం 75.02 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.

నియోజకవర్గంలో 61.88 శాతం పోలింగ్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజవర్గానికి సంబంధించి మొత్తం 11 బూత్‌లలో పోలింగ్ జరగ్గా అందులో ప్రత్తిపాడు మండలంలోని రెండు బూత్‌లలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. ప్రత్తిపాడులోని 256, 257 పోలింగ్ బూత్‌లలో 71.51 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం నియోజకవర్గంలో 10294 మంది పట్టబద్రుల ఓట్లు ఉండగా అందులో 6370 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా నియోజకవర్గంలో పోలింగ్ 61.88 శాతంగా నమోదైంది.



ప్రత్తిపాడులో ఓటర్లకు స్లిప్పులు రాసి అందజేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

స్లిప్పులు రాసి పంపిణీ చేసిన ఎమ్మెల్యే బూర్ల

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు నియోజకవర్గంలో జరుగుతున్న పట్టభద్రుల ఎన్నికలను పరిశీలించారు. ప్రతి మండలాన్ని తిరుగుతూ అక్కడ పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ క్రమంలో ప్రత్తిపాడు పోలింగ్ బూత్ సమీపంలో కూటమి నేతలు ఏర్పాటు చేసిన పోలింగ్ క్యాంపును ఆయన సందర్శించి ఓటర్లకు ఆయనే స్వయంగా స్లిప్పులు రాసి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, అయినంపూడి నాగేశ్వరరావు, కొర్రపాటి మధు, మాకినేని జగన్ పాల్గొన్నారు.

వట్టిచెరుకూరులో ప్రశాంతంగా పోలింగ్



ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగురాలు నర్రా శిరీష

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వట్టిచెరుకూరు సీఐ రమానాయక్, ఎస్‌ఐ సుబ్బారావు, సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గింజుపల్లి వెంకటేశ్వరరావు తదితరులతో కలసి జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో పోలింగ్ సరళిని పరి శీలించారు. తొలుత ఎమ్మెల్యే ఓటర్లకు సంబంధించి స్లిప్‌లను స్వయంగా రాసి ఓటర్లకు అందజేశారు. 9 గంటల సమయంలో అనంతవరప్పాడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు నర్రా శిరీష ప్రత్యేక వాహనంలో కేంద్రానికి చేరుకోగా పోలింగ్ సిబ్బంది, పోలీసులు ఆమెను వీల్ చైర్‌లో పోలింగ్ బూత్‌లోకి తీసుకొని వెళ్లి ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేశారు. మండలంలో 64.39 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు.

పెదనందిపాడులో 66.7 శాతంపోలింగ్

పెదనందిపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలోని రెండు పోలింగ్ బూత్‌ల్లో 1603 ఓట్లకు గాను 1070 ఓట్లు పోలైనట్లు, 66.7శాతం ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తహసీల్దార్ శంకర్‌బాబు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మధుపవన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కాకుమాను మండలంలో 68.40శాతం

కాకుమాను ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో 68.40 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 1076 ఓట్లు ఉండగా 736 ఓట్లు పోలయినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. ఓలింగ్ సరళిని డీఎస్పీ భానోదయ, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ పృథ్వీ ఏకనాథ్, రెవిన్యూ అధికారులు పర్యవేక్షించారు. మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్, నక్కల శైలజ, అగస్టీన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కూటమి అభ్యర్థిదే విజయం : ఎమ్మెల్యే

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధిస్తారని స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. గురువారం కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్‌చౌదరి, కొల్లా వీరయ్య చౌదరి, మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణచంద్రరావు, అగస్టీన్ తదితరులున్నారు.

రమణీయం.. రథోత్సవం

- అశేషంగా తరలివచ్చిన భక్త జనులు
- శివనామస్మరణతో మార్మోగిన వీధులు
- భక్తులతో కలిసి రథం లాగిన మంత్రి లోకేశ్



భక్తులతో ముందుకు సాగుతున్న మంగళగిరిలోని మల్లేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవానికి ముందు పూజల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్క రించుకుని గురువారం మంగళగిరిలో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివార్ల దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. రెండు వైష్ణవాలయాల నడుమ మంగళగిరి మెట్ల మార్గంలోని శివాలయంలో బుధవారం అర్ధరాత్రి స్వామివార్ల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన రథోత్సవం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు కొనసాగి తిరిగి అదేమార్గంలో రథశాలను చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మెయిన్ బజారు, అనుబంధ వీధులు కిక్కిరిసిపోయాయి. పురవీధులన్నీ శివనామస్మరణతో మార్మోగాయి.

మల్లేశ్వరస్వామి రథోత్సవానికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు దేవస్థానం అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రథోత్సవానికి ముందు



భక్తులతో కలిసి రథం లాగుతున్న మంత్రి నారా లోకేశ్

శివాలయం ప్రధాన అర్చకుడు తెలిదేవరపల్లి మహేష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం మంత్రి లోకేశ్ భక్తులతో కలిసి కొద్ది దూరం రథం లాగారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, దేవదాయశాఖ సహాయ కమిషనరు అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, శివాలయం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, బోగి వినోద్, మన్నెం రమేష్‌బాబు, గోసాల రాఘవ, రంగిశెట్టి పెద్దబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ నియోజకవర్గంలో 72.26 శాతం

- పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్
- ఓటు హక్కు వినియోగించుకున్న మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి



తాడికొండలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఫిబ్రవరి 27: కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ జరిగింది. 4 గంటలకు తరువాత క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి అధికారులు అవకాశం కల్పించారు. నియోజకవర్గంలో 72.26శాతం నమోదైంది. నియోజకవర్గం లో 8709 ఓట్లు ఉండగా 6293 ఓట్లు పోలైయ్యాయి. ఉదయం 8 గంటలకే పోలింగ్‌కేంద్రాలకు ఓటర్లు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దివ్యాంగులు, చంటి బిడ్డలతో మహిళలు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పోలిం గ్ సరళిని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాదిగ కార్పొ రేషన్ చైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఓటు హక్కును వినియో గించుకున్నారు. కాగా ఓటు హక్కును వినియోగించుకోవటానికి వచ్చిన ఓటర్లు తమతో పాటు గుర్తింపు కార్డుల జిరాక్సులు తీసు కువచ్చారు. మధ్యాహ్నం 3గంటల వరకు గుర్తింపు కార్డులు జిరాక్సులు చూపించిన ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనుమతి ఇచ్చిన పోలింగ్ అధికారులు, ఆ తరువాత జిరాక్సులు అనుమతించమని తిప్పి పంపించారు. దీంతో టీడీపీ నాయకులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న తహసీల్దార్ జిరాక్సులపై అటెస్టేషన్ చేస్తామని చెప్పి సంతకాలు చేసి పంపటంతో ఓటర్లు ఓటు వినియోగించుకున్నారు.



తాడికొండలో క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లు

తుళ్లూరులో 79.11 శాతం పోలింగ్

తుళ్లూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌లలో పట్టభద్రులు తమ ఓటు హక్కును గురువారం వినియోగించుకున్నారు. మండలంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓట్లు 2,662 ఉన్నాయి. అందులో పోలైనవి 2,107 ఓట్లు. 79.11 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పెదకూరపాటు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ఫిరంగిపురంలో 69 శాతం పోలింగ్



ఫిరంగిపురంలో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

ఫిరంగిపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 205, 206, 206ఏ పోలింగ్ బూత్‌లలో మొత్తం 69 శాతం ఓటింగ్ గురువారం జరిగిందని తహసీల్దార్ కే ప్రసాదరావు తెలిపారు. మండలంలో మొత్తం పట్ట భద్రుల ఓట్లు 2074 ఉండగా 1431 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. మధ్యాహ్నం 11 గంటలకు జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ వచ్చి ఓటర్లను, బీఎల్‌వోలను, పోలింగ్ అధికారులను, ఏజెంట్లను వసతుల గురించి అడిగి తెలుసుకొని పోలింగ్ సజావుగా జరిగే లా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ అనంతరం ఎమ్మెల్యే వచ్చి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. కూటమి నాయకులు కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



అమరావతిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చినరాములు

డాక్టర్ నాగభైరవ సాహిత్య సౌరభాలు అజరామరం

- ప్రముఖ విద్యావేత్త పెంట్యాల శ్రీమన్నారాయణ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ కవి, కవి రత్న, డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు కలం నుంచి జాలువారిన సాహితీ సౌరభాలు వర్తమాన, భవిష్యత్ రచయితలకు, సాహితీవేత్తలకు దిక్సూచి వంటివని ప్రముఖ విద్యావేత్త పెంట్యాల శ్రీమన్నారాయణ అన్నారు. ప్రముఖ కవి, రచయిత, కళారత్న డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు సాహిత్య పురస్కార సభ పలువురు రచయితలు, సాహితీవేత్తల సమక్షంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై డాక్టర్ నూనె అంకమ్మరావు, డాక్టర్ సెట్లం చంద్రమోహన్‌లకు నాగభైరవ సాహిత్య పురస్కారాలు అందజేశారు. సభకు జక్కంపూడి సీతారామారావు అధ్యక్షత వహించగా దేవస్థానం అధ్యక్షుడు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు.

క్వారీ తిరునాళ్ల ఆదాయం రూ.16 లక్షలు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయానికి రూ.16 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో రామకోటేశ్వరరావు తెలిపారు. గురువారం భక్తుల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఆలయం వద్ద ఉన్న మూడు హుండీల ద్వారా రూ.6,72,636 ఆదాయం సమకూరింది. పూజా టికెట్లు, లడ్డూల విక్రయం ద్వారా రూ. 6,86,195 ఆదాయం సమకూరింది. కొబ్బరిచిప్పలు, తదితర పూజల ద్వారా రూ.2,88,800 ఆదాయం సమకూరింది.



హుండీల నగదును లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

క్వారీ దేవాలయ ఆదాయం రూ.16 లక్షలు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయానికి రూ.16 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో రామకోటేశ్వర రావు తెలిపారు. గురువారం భక్తుల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఆలయం వద్ద ఉన్న మూడు హుండీల ద్వారా రూ.6,72,636 ఆదాయం సమకూరింది. పూజా టికెట్లు లడ్డూల విక్రయం ద్వారా రూ.6,86,195 ఆదాయం సమకూరింది. కొబ్బరిచిప్పలు, తదితర ఇతర పూజల ద్వారా రూ.2,88,800 ఆదాయం సమకూరింది. మొత్తం దేవాలయానికి రూ.16,37,631 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలియజేశారు.

చింతలపూడిలో గృహం దగ్ధం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో గృహం దగ్ధమైన సంఘటన గురువారం మండల పరిధిలోని చింతలపూడిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం చింతలపూడిలోని నల్లూరి వెంకటేశ్వర్లు గృహంలో ఉదయం మంటలు చెలరేగి గృహానికి నిప్పంటుకుంది. ప్రమాద సమయంలో గృహంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. గృహానికి అంటుకున్న మంటలు క్షణాల వ్యవధిలో ఇంటికి మొత్తం వ్యాపించడంతో గృహంలోని వస్తు సామగ్రి సైతం పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాదం సమాచారం తెలుసుకున్న స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం స

ఏఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలలో 39మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. కళాశాలలో గురువారం ఎంపికైన విద్యార్థులను అభినందించి విలేకరులతో మాట్లాడారు. బెంగళూరుకు చెందిన మల్టీనేషన్ కంపెనీ 24/7 ఏఐ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తమ విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. వీరికి రూ.3 లక్షల వార్షిక వేతనం లభిస్తుదన్నారు. చెన్నైకు చెందిన మరో కంపెనీ బ్రాండ్-4 కూడా విద్యార్థులను ఎంపిక చేసిందని, ఈ సంస్థకు ఎంపికైన వారికి రూ.2.60లక్షల నుంచి రూ.3.60 లక్షల వరకు వేతనం లభిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శివరాత్రి తిరునాళ్లలో అపశృతి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాలలో అపశృతి చోటు చేసుకుంది. మండల పరిధిలోని కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామ శివార్లలోని సంగమేశ్వరస్వామికి గ్రామస్థులు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. ప్రభల ఉత్సవం సందర్భంగా తాళ్లపాలెం గ్రామస్థులు నిర్మించిన 70అడుగుల భారీ విద్యుత్ ప్రభ ఆలయం వద్దకు భక్తులు చేర్చే క్రమంలో ఆలయానికి సమీపంలో రోడ్డు గతుకులతో పక్కకు ఒరిగిపోయింది. వ్యయప్రయాసలకు ఓర్చి భక్తి శ్రద్ధలతో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ నేలకు ఒరగడంతో భక్తులు తీవ్ర ఆవేదన చెందారు. ప్రభ నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రభ సమీపంలోని పంట పొలాల వైపు ఒరిగిపోవడంతో ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

ఆరోపణలు... ప్రత్యారోపణల మధ్య

ప్రశాంతంగా పోలింగ్

- తెనాలిలో 68.91 శాతం పోలింగ్ నమోదు
- ఎన్నికల సంఘానికి లక్ష్మణరావు వర్గం ఫిర్యాదులు
- చివరి నిమిషంలో ఓటు వేయనీయలేదంటూ టీడీపీ, జనసేన ధర్నా



తెనాలి బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న సమయంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



జేవీఆర్ మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, ఐతానగర్ మునిసిపల్ స్కూల్‌లో పోలింగ్ తీరును పరిశీలిస్తున్న అభ్యర్థి లక్ష్మణరావు



చివరి నిమిషంలో ఓటు వేయనీయలేదంటూ పోలింగ్ కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న కూటమి నాయకులు



మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్‌ల ఆత్మీయ ఆలింగనం

తెనాలి ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్వల్ప వాదనలు... ఒకరిపై ఒకరు ఆరోపణలు... రిగ్గింగ్ జరుగుతోందంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు... ఓటు వేసేందుకు చివరి నిమిషంలో అవకాశం ఇవ్వలేదంటూ ధర్నాల వంటి స్వల్ప సంఘటనల మధ్య తెనాలి డివిజన్‌లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్‌లో భాగంగా ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్న సమయానికే పోలింగ్ పూర్తయి పోయిందా అన్నట్లు 50శాతానికి పైగా పోలింగ్ నమోదు అయితే, ఆ తరువాత ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో పెద్దగా కనిపించలేదు. తెనాలి డివిజన్‌లోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి వంటి ముఖ్య పట్టణాల్లో, రూరల్ గ్రామాల్లో పోలింగ్‌శాతం బాగానే నమోదయ్యింది. డివిజన్ మొత్తం మీద 47,324మంది ఓటర్లు ఉండగా, 33,169 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 19,667 మంది ఓటువేస్తే, మహిళలు 13,485 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. ఇతరులు కూడా ఏడుగురు ఓటు వేశారు. దీంతో 70.08 శాతం పోలింగ్ నమోదయ్యింది. డివిజన్‌లో మధ్యాహ్నం 12గంటలలోపు 32.01శాతం ఓట్లు పోల్ అయితే, మధ్యాహ్నం 2గంటలకు 51.03శాతం పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ ముగిసే సమయానికి 70.09శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెనాలి నియోజకవర్గంలోని ఒక్క తెనాలి మండలంలోనే 68.91శాతం ఓట్లు పోల్ అయ్యాయి. మొత్తం 23,358 ఓట్లు ఉంటే, 16,096మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు పోలింగ్ జరుగుతున్న తీరును తెనాలి ఐతానగర్ పాఠశాలలో పరిశీలిస్తే, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మారీసుపేటలోని పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలించారు. పోలింగ్ సరళిని ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు.



పొన్నూరులో ఓటు హక్కు వినియోగం కోసం బారులుదీరిన ఓటర్లు

ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు

అధికార పార్టీ ఒక పోలింగ్ బూత్‌నే ఆక్రమించేసి రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని, ఓటర్లను కార్లలో తరలించి ప్రలోభ పెడుతున్నారని, వేలిపై వేసిన సిరా గుర్తును రిమూవర్‌తో చెరిపి వేసి ఒకే వ్యక్తి పలుమార్లు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ నేరుగా ఎన్నికల సంఘానికే ఫిర్యాదులు అందాయి. తెనాలి మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌కు గ్రామీణ ప్రాంతాల నుంచి కార్లు ఏర్పాటుచేసి ఓటర్లను తరలిస్తున్నారని, 302, 304 పోలింగ్ స్టేషన్‌లలో అధికార పార్టీ వర్గీయులంతా గుంపులుగా చేరి బూత్‌నే ఆక్రమించేసి రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని ఓ వ్యక్తి నుంచి నేరుగా ఎన్నికల సంఘానికే ఫిర్యాదు అందింది. మారీసుపేటలోని కేఎస్ఎం ఉన్నత పాఠశాలలో రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని, ఓటువేసిన వారే బయటకు వచ్చి సిరా ముద్రను రిమూవర్‌తో చెరిపివేసి మరొకరి పేరుతో లోపలికి వెళ్లి ఓటు వేసి వస్తున్నారంటూ ఎన్నికల సంఘానికి మరొక వ్యక్తి ఫిర్యాదు చేశారు. తెనాలిలోని ఐతానగర్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలించేందుకు వచ్చిన అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఎన్నికల సంఘానికి, జిల్లా అధికారులకు, అధికార పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడుతుందంటూ ఫిర్యాదులు చేశారు. ఇవి కాక కూటమి నాయకులు లక్ష్మణరావుకు సంబంధించిన సహాయ కేంద్రంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని ఫిర్యాదుచేస్తే, అటు లక్ష్మణరావు తరపు నాయకులు కూడా టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని ప్రతి ఆరోపణలు, ఫిర్యాదులు చేశారు. ఓటరు స్లిప్పు అన్ని ఆధారాలతో పోలింగ్ స్టేషన్‌కు వచ్చిన ఓ ఓటరు పేరు మరణించిన జాబితాలో ఉండటం, కొందరి ఓట్లు వారు వేయక ముందే వేరొకరు వేసేయడం వంటి సంఘటనలతో పలుచోట్ల చాలెంజ్ ఓట్లు పడ్డాయి. మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో 4గంటల లోపు ఓటు వేసేందుకు ఓటర్లు వస్తే పీవో వారితో ఓటు వేయనివ్వకుండా సీల్ వేసేశారంటూ జనసేన, టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రం బయట రోడ్డుపై బైఠాయించి కొద్దిసేపు ధర్నా చేశారు. దీనిపై అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, తహసీల్దార్ గోపాలకృష్ణ, వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావులు సీసీ కెమెరాలను పరిశీలించి ఓటర్లు సమయం ముగిసిన తరువాతే వచ్చారని తేలడంతో ధర్నా చేస్తున్నవారికి సర్దిచెప్పి పంపించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు...

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తమ ఓటు హక్కును మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ ఐతానగర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

మీ ఓటు రేపటి అభివృద్ధికి ఆశీర్వాదం

తెనాలి ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు వేసే ప్రతి ఓటు రేపటి అభివృద్ధికి ఆశీర్వాదం అంటూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్‌లో భాగంగా ఆయన తెనాలిలోని రావి సాంబయ్య బాలుర మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు రూపంలో కూటమి ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు.



తెనాలి మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేస్తున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్, పొన్నూరులో ఓటింగ్‌లో కుటుంబ సభ్యులతో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతారణంలో సాగింది. నియోజకవర్గంలో 71.52శాతం పోలింగ్ నమోదయినట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం పోలింగ్ శాతం మందకొడిగా సాగింది. 8గంటలకు పోలింగ్ ప్రారంభం అయినప్పటికి పోలింగ్‌లో పాల్గొనేందుకు ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. 9గంటలకు 10శాతం పోలింగ్ కూడా నమోదు కానీ పరిస్థితులు ఉన్నాయి. అయితే అక్కడి నుంచి పోలింగ్ బూత్‌లకు పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పొన్నూరు పట్టణంలో 261 పోలింగ్ బూత్‌లో ఓటర్లు బారులుతీరి ఓటు వేశారు. అలాగే రూరల్ మండలంలోని 263, బూత్‌లో కూడా 75.44శాతం ఓట్లు నమోదు అయ్యాయి. పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో మూడు పోలింగ్ బూత్‌లలో 2190 మంది ఓటర్లు ఉండగా 1611ఓట్లు పోలయ్యాయి. రూరల్ మండలంలో 1435ఓట్లు ఉండగా 1021ఓట్లు పోలయ్యాయి. చేబ్రోలు మండలంలో 1874 ఓట్లు ఉండగా 1283ఓట్లు పోలయ్యాయి. పెదకాకాని మండలంలో 2523మంది ఓటర్లు ఉండగా 1822ఓట్లు పోలయ్యాయి. పొన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా 8022ఓట్లు ఉండగా 5737ఓట్లు పోలయ్యాయి. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 263 పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులతో పాటు వారి పెద్ద కుమార్తె డాక్టర్ వీరవైష్ణవి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్దకు దివ్యాంగులు వృద్ధులు సైతం వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దివ్యాంగుల కోసం వీల్ చైర్‌లను ఏర్పాటుచేసి సౌకర్యాలను కల్పించారు. పోలింగ్ సరళిని తహసీల్దార్ జియావుల్ హక్, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పర్యవేక్షించారు. అర్బన్ సీఐ రవికిరణ్, ఎస్ఐ శ్రీహరిలు పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

కొల్లిపరలో...

కొల్లిపర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు గురువారం నాడు మండల కేంద్రం కొల్లిపరలో ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రం కొల్లిపర హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయగా మొత్తం 2వేల581 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 1889మంది మాత్రమే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురుషులు 1214మంది, మహిళలు 675 మంది ఓటు వేయగా 27శాతం మంది పోలింగ్‌కు ఓటర్లు గైర్హాజరైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎన్నికల అధికారి, ఇరిగేషన్ జేఈ విజయరాజు పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు.



కొల్లిపరలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, కొల్లిపర హైస్కూల్‌లో బారులుతీరిన పట్టభద్రులు



కొల్లిపరలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధుడిని తీసుకెళుతున్న వీఆర్ఏలు,



పొన్నూరులో దివ్యాంగుడిని పోలింగ్‌బూత్‌లోకి తీసుకువెళ్లేందుకు సహకరిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

వైభవంగా కల్యాణోత్సవాలు



సంగమేశ్వరాలయంలో దివ్యకల్యాణ మహోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్నస్వామి వార్లు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడిలో చరిత్ర ప్రసిద్ధి చెందిన బాలాత్రిపురసుందరీ సమేత సంగమేశ్వరస్వామి వార్ల ఆలయం భక్తుల శివనామస్మరణలతో పులకించింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున సంగమేశ్వరస్వామి, పాపవినాశేశ్వరస్వామి, వీరభద్రస్వామి వార్ల దివ్య కల్యాణం కనులపండుగగా జరిపారు. వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వార్ల కల్యాణాన్ని వీక్షించి తరించారు. స్వామివార్ల నామస్మరణతో ఆద్యంతం కల్యాణం కమనీయంగా జరిగింది. గ్రామం నుంచి పెద్దఎత్తున స్వామివార్ల ఆలయానికి ప్రభలు తరలివచ్చాయి. రాత్రికి ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై స్వామి వార్ల రథోత్సవం కనులపండుగగా జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా అగస్త్యేశ్వరస్వామి వార్ల రథోత్సవం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో గంగాపార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి వార్ల దివ్య రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున స్వామివార్ల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. సాయంత్ర ఉత్సవమూర్తులను పెద్దరథంపై ఆసీనులను చేసి వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కొలకలూరులో స్వామి వార్ల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంగానమ్మపేటలో రామేశ్వరస్వామి...

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీపర్వతవర్ధిని సమేత రామేశ్వరస్వామి రథోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి పురస్కరించుకుని గంగానమ్మపేటలోని పాత శివాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా అలంకరించిన పురాతన రథంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి నెహ్రూరోడ్డు, మెయిన్‌రోడ్డు, గంగానమ్మపేటలో ఊరేగించారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కనక తప్పెట్లు, కళాకారుల విచిత్ర విన్యాసాలతో రథోత్సవం సాగింది. ఉత్సవాలలో భాగంగా ఉదయం స్వామివారికి నందివాహన సేవ నిర్వహించారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులు భారీగా తరలి రావడంతో గాంధీచౌక్, నెహ్రూరోడ్డు, మెయిన్ రోడ్డు కిటకిటలాడాయి. విద్యుత్ లైన్లు తొలగించి రథోత్సవానికి ఆటంకం లేకుండా చేశారు. పెదరావూరుకు చెందిన యువకులు రథానికి చొప్పాలు వేశారు. ఈవో రమణకుమారి, అర్చకులు పొత్తూరి వెంకటసురేష్, ధర్మకర్తలు భాస్కరరావు, సుబ్రహ్మణ్యం, దాతలు పాల్గొన్నారు.



గంగానమ్మపేటలో జరిగిన స్వామి వారి రథోత్సవం

గాంధీచౌక్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి...

గాంధీచౌక్‌లోని శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాలను అలంకరించిన రథంపై ఉంచి పట్టణంలో ఊరేగించారు.

అన్నప్రసాద వితరణ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సుల్తానాబాద్ కాశీ అన్నపూర్ణేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం స్వామి వార్ల శాంతికల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంలు పాల్గొని అన్నప్రసాదాన్ని వడ్డించారు. మురళి, నాగభూషణంలను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించి దర్శనం అనంతరం దుశాలువాలతో సత్కరించారు. నిర్వాహక కమిటీ సభ్యులు బత్తుల శ్రీనివాసరావు, కె.సాంబయ్య, కె.హనుమంతరావు, తన్నీరు వీరయ్య, తురకా అనీల్, వాసుదేవశర్మ దూపాటి వెంకటసుబ్బయ్య పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సహస్ర లింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని గంగా పార్వతి సమేత సహస్ర లింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం అర్ధరాత్రి భక్తి శ్రద్ధలతో జరిగింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై గంగా పార్వతి సమేత సహస్ర లింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రతిష్టించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ సహస్ర లింగేశ్వరస్వామి కల్యాణ క్రతువును అర్చక స్వాములు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.



కల్యాణ పూజలందుకున్న గంగా పార్వతి సమేత సహస్ర లింగేశ్వరస్వామి

భక్తి శ్రద్ధలతో కొల్లిపర తిరునాళ్ళ

కొల్లిపర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో గంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి తిరునాళ్ల గురువారం రాత్రి వైభవంగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయం ప్రాంగణంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత శివలింగానికి అర్చకులు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్ ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు హారతులు ఇచ్చి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని చివలూరు, దావులూరు, హనుమాన్‌పాలెం, అత్తోట, మున్నంగి, తూములూరు తదితర శివాలయాల్లో అర్చకులు వివిధ అభిషేకాలు నిర్వహించారు.



కొల్లిపరలో పార్వతీ పరమేశ్వర్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు